ప్రజాశక్తి

శనివారం 17 మే 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

వర్షం బీభత్సం

- పిడుగులతో ఫిరంగుల మోత
- నిశిరాత్రి వేళ గర్జించిన ఆకాశం
- ఈదురు గాలులకు కూలిన చెట్లు
- విద్యుత్ లేక భారీ వర్షంతో భయం గుప్పిట్లో జనం



గుంటూరులో కంకరగుంట ఆర్‌యూబిలో చేరిన వర్షం నీరు



గుంటూరు అరండల్‌పేట ఒకటో లైనులో కూలిన భారీ వర్షం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పిడుగులతో ఫిరంగుల మోతతో తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో ఆకాశం గర్జిస్తున్న భారీ శబ్దాలు, ఈదురు గాలులతో కూడిన వర్షంతో జిల్లా ప్రజలు భయకంపితులయ్యారు. బయటకు వచ్చేందుకు భారీ వర్షం, విద్యుత్ సరఫరా లేక అంతటా అంధకారం అలుముకోవడంతో భీకర శబ్దాలతో తల్లడిల్లిపోయారు. భారీగా వీచిన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు కూలాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దాదాపు 40 ఏళ్ల నాటి వృక్షాలు సైతం నేలకూలాయి. పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి.

గుంటూరులోని పలు ప్రాంతాల్లో వర్షం నీరు చేరి రాకపోకలకు అంతరాయం కల్గింది.చెట్లు,విద్యుత్ తీగలు పడిపోవడంతో గుంటూరులో తెల్లవారుజామున 2 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచింది. గుంటూరులోని కంకరగుంట ఆర్‌యుబి, డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద వర్షపునీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. రోడ్లపైకి వర్షం నీరు చేరి రోడ్లన్నీ బురదమయంగా మారాయి. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు వర్షంతో తాత్కాలికంగా ఉపశమనం పొందారు. ఉదయం నుంచి రాత్రి వరకు వడగాల్పులతో అల్లాడిన ప్రజలకు వేకువజామున భారీ వర్షంతో చల్లని వాతావరణం ఏర్పడటంతో సేదతీరారు. వేసవి కాలంలో ఇంత భారీ వర్షం ఇటీవల కాలంలో ఇదే మొదటి సారి అని అధికారులు తెలిపారు. వర్షాలకు రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులకు అంతరాయం కల్గింది. ప్రత్తిపాడులోని పలు ప్రాంతాలలో వర్షం నీరు చేరింది. గుంటూరు నగరం మొత్తం వర్షం నీటితో శుక్రవారం ఉదయం 10 గంటల వరకు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

గుంటూరులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేక తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం, గాలులకు గుంటూరులో హోర్డింగ్‌లు కూడా నేలకూలాయి. డొంకరోడ్డు, అరండల్‌పేట, అమరావతి రోడ్, విద్యానగర్ మెయిన్‌రోడ్, మారుతినగర్,

2లో



మాట్లాడుతున్న మంత్రి నారాయణ, వేదికపై కేంద్రమంత్రి చంద్రశేఖర్, కేంద్ర అధికారులు జోషి, కునాల్ సత్యార్థి

నక్షాతో భూ వివాదాలకు చెక్

- పట్టణాల్లో పక్కాగా రెవెన్యూ రికార్డుల నిర్వహణ
- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ జియోస్పాటిల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా)ను కేంద్రం అమలులోకి తీసుకువచ్చిందని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. భూముల డిజిటలైజేషన్‌పై గుంటూరు ఐటిసి వెల్కమ్ హోటల్‌లో శుక్రవారం జరిగిన ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ఉన్నతాధికారులు వర్కుషాపులో పాల్గొన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పట్టణాల్లో రెవెన్యూ రికార్డులు పక్కాగా అమలు చేసేందుకు నక్షాను అమలు చేయనున్నట్టు తెలిపారు. పట్టణాల్లో పారదర్శకమైన, సమర్ధవంతమైన పాలన అందించేందుకు నక్షా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నక్షా పైలట్ ప్రోగ్రామ్ ద్వారా దేశంలో 152 మున్సిపాల్టీలను ఎంపిక చేయగా రాష్ట్రంలో కుప్పం మున్సిపాల్టీ, ఒంగోలు, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, మంగళగిరి - తాడేపల్లి, ఏలూరు, తిరుపతి నగరపాలక సంస్థలను కేంద్రం ఎంపిక చేసిందన్నారు. దీని ద్వారా రాష్ట్రంలోని 10 మున్సిపాలిటీల్లో 524 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న 9.5 లక్షల ఆస్తులను సర్వే చేసి డిజిటలైజేషన్ చేయనున్నామన్నారు. కేంద్రం సహకారంతో నిర్దేశిత గడువులోగా 10 మున్సిపాలిటీల్లో సర్వే పూర్తి చేసి రికార్డులను డిజిటలైజేషన్ చేస్తామన్నారు. ఇప్పటికే 8 మున్సిపాలిటీల్లో ఏరియల్ సర్వే పూర్తయిందని, ఏలూరు, మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ లలో ఏరియల్ సర్వే కొనసాగుతుందన్నారు. కుప్పం, ఒంగోలు, అనంతపురం, మున్సిపాలిటీల్లో క్షేత్రస్థాయిలో 6000 ప్రభుత్వ ఆస్తుల రీసర్వే కూడా పూర్తయిందన్నారు.

2లో



నరసరావుపేటలో తిరంగ ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాల వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పౌరులంతా దేశాన్ని ప్రేమించాలని, దేశభక్తి కలిగి ఉండాలని అన్నారు. యుద్ధంలో వీర మరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. త్రిదళాధిపతులకు దేశ ప్రజలు రుణపడి ఉన్నారన్నారు. ర్యాలీలో టిడిపి నాయకులు కపలవాయి విజయ్ కుమార్, గుత్తా అంకమ్మ చౌదరి, బత్తుల మురళి, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.





అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు ఛానల్ పనులు త్వరగా చేపట్టండి

జల వనరుల శాఖ అధికారులతో కేంద్ర మంత్రి చంద్రశేఖర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఛానల్ విస్తరణ పనులను త్వరగా ప్రారంభించాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. భూసేకరణ సర్వే పనులతో పాటు

2లో



తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, రైతు సంఘాల నాయకులు

డికె పట్టా రైతులకూ అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన - తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం పమిడిమర్రు గ్రామంలో 34 ఏళ్ల క్రితం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు చెందిన 90 మందికి అప్పటి ప్రభుత్వం 80 ఎకరాల ప్రభుత్వ భూమిని పూర్తి స్థాయిలో హక్కులు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేసిందని రైతు, కౌలురైతు సంఘాల నాయకులు తెలిపారు. ఆ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న రైతులకు అన్నదాత సఖీభవ పథకం వర్తింపజేయాలని విన్నవించారు. ఈ మేరకు నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేసి తహశీల్దార్ కె.వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు

2లో

నేడు 'బీట్ ది హీట్' కార్యక్రమం

ప్రజాశక్తి - తెనాలి

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం 'బీట్ ది హీట్' నినాదంతో పట్టణంలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ బి.శేషన్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు ప్రతినెలా మూడవ వారం ప్రత్యేక నినాదంతో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా శనివారం నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం ఏడు గంటలకు శివాజీ చౌక్ నుంచి ప్రారంభమై 11 గంటలకు మహాత్మా గాంధీ కూరగాయల మార్కెట్ వరకు, అలాగే సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 7గంటల వరకు జిల్లా ప్రభుత్వ వైద్యశాల నుంచి రావి టవర్స్ వరకు స్వచ్ఛత కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలన్నారు.

20న 'శిశిరంలో గులాబీలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

న్యాయమూర్తి, విద్యావేత్త ఎంసి చాగ్లా జీవిత విశేషాలను తెలియజేసే ఆయన ఆత్మకథ 'శిశిరంలో గులాబీలు' పుస్తకావిష్కరణ సభ ఈనెల 20న సాయంత్రం 6 గంటలకు స్థానిక లక్ష్మీపురంలోని ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జయచాముండేశ్వరి పబ్లికేషన్స్ నిర్వాహకులు కె.జయలక్ష్మి, చాముండేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ తెలుగు అనువాదకులు కందిమళ్ల శివప్రసాద్ రాసిన ఈ పుస్తక పరిచయ సభకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహిస్తారని, గ్రంధావిష్కరణ అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంక సూర్యనారాయణ చేస్తారన్నారు. ఉమ్మడి రాష్ట్రం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ కేజీ శంకర్, సాహితీవేత్త రావెల సాంబశివరావు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ నెల్లూరు సత్యనారాయణ, ప్రముఖ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ పాల్గొంటారన్నారు.

కొనసాగుతున్న సిహెచ్‌ఓల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు : సిహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతుంది. శుక్రవారంతో 19వ రోజుకు చేరింది. ఈ కలెక్టరేట్ ఎదుట వర్షపు నీటిలో సైతం నిరసన కొనసాగించారు. ఈ సందరంగా అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం తమ సమస్యల పట్ల సాచివేత ధోరణి విడనాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. ముఖ్యంగా క్రమబద్ధీకరణ, ప్రోవిడెంట్ ఫండ్ తదితర అంశాలపై తక్షణమే స్పందించి అసోసియేషన్‌తో చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు జి.వనజ, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, టౌన్ అధ్యక్షులు అంజిబాబు, సిహెచ్‌ఒల సంఘం జిల్లాకో ఆర్డినేటర్ దీక్షిత, నాయకులు జీవనజ్యోతి, శోభారాణి, కె.లక్ష్మి, సుభాని, జహీర్, టీ.సిరి. ఐ.జ్యోతి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి : బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వృద్ధుడు రెంటపాళ్లకు చెందిన పెద్ద పిచ్చయ్య ఆర్టీసీ బస్టాండ్ వద్ద మెయిన్ రోడ్డుపై వెళుతుండగా, గుంటూరు నుండి సత్తెనపల్లి వచ్చిన ఆర్టీసీ బస్సు సత్తెనపల్లి బస్టాండ్ లోపలికి వెళ్లే మార్గంలో పెద్ద పిచ్చయ్యను ఢీకొట్టడంతో కింద పడిపోయిన పిచ్చయ్య రెండు కాళ్లపై బస్సు టైర్లు పోవడంతో కాళ్లు రెండు నుజ్జు అయ్యి తీవ్ర రక్తస్రావం జరిగింది. 108 వాహనంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జోసెఫ్ తంబిపై కేసు

ప్రజాశక్తి పెదకూరపాడు : మండలంలోని తమ్మవరం గ్రామానికి చెందిన రెబ్బవరపు దిలీప్ కుమార్ మరియు అదే గ్రామానికి చెందిన గుడేడు జోసెఫ్ తంబి అను ఇరువురి మధ్య 15 తేదీన సెల్ఫోన్ విషయంలో గొడవ జరిగింది. జోసెఫ్ తంబి, దిలీప్ కుమార్ పై కత్తితో దాడి చేయగా దిలీప్ కుమార్ చాతి వద్ద రక్తగాయాలవడంతో బంధువులు దిలీప్ కుమార్ ను హాస్పిటల్ లో చేర్పించగా ప్రస్తుతం దిలీప్ కుమార్ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు, హాస్పిటల్ నుండి వచ్చిన స్టేట్మెంట్ గాను పెదకూరపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ కేసు నమోదు చేశారు.





గుంటూరు కోబాల్ట్‌పేటలో విరిగిపడిన చెట్టు తొలగిస్తున్నకార్మికులు, వర్షం నీటిలో వెళుతున్న వాహనాలు

వర్షం బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

బాలాజీనగర్, పాత గుంటూరు, సుద్దపల్లి డొంక, కంకరగుంట ఆర్‌యుబి తదితర ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. 3 వంతెనల వద్ద నిలిచిన సిల్ట్‌ని, జెట్టింగ్ మెషిన్ల ద్వారా శుభ్రం చేయాలని, కంకరగుంట ఆర్‌యుబి వద్ద అదనపు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని బెయిల్‌అవుట్ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయం వలన త్రాగునీటి సరఫరాకి సమస్య లేకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.తుళ్లూరు, వట్టిచెరకూరు, పెదకాకాని, కాకుమాను, తాడికొండ, పెదనందిపాడు మండలాల్లో భారీ వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రహదారులు దెబ్బతిన్నాయి. తెనాలి డివిజన్‌లో వర్షం తక్కువగా ఉన్నా గాలులు తీవ్రత ఎక్కువగా ఉంది. జిల్లా వ్యాప్తంగా సగటున 48 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని 18 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా ప్రత్తిపాడులో 105.4 మిల్లీమీటర్ల వర్షంపాతం నమోదు కాగా అత్యల్పంగా తెనాలిలో 10.2 మిల్లీ మీటర్ల వర్షంపాతం నమోదు అయింది.

వర్షపాతంమండలాలవారీగా... (మిల్లీ మీటర్లలో)

ప్రత్తిపాడు 105.4	పెదకాకాని 37.4
గుంటూరు పశ్చిమ 103.4	మంగళగిరి 27.8
గుంటూరు తూర్పు 84.2	తాడేపల్లి 27.4
వట్టిచెరుకూరు 99	చేబ్రోలు 23.8
పెదనందిపాడు 88.6	మేడికొండూరు 15.6
తుళ్లూరు 86.4	పొన్నూరు 14.8
కాకుమాను 53.2	ఫిరంగిపురం 11.2
తాడికొండ 50.2	తెనాలి 10.2

నక్షాతో భూ వివాదాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయి సర్వేకు అవసరమైన 166 రోవర్లలో 158 రోవర్లు సిద్ధంగా ఉన్నాయని, సర్వే కోసం క్షేత్ర స్థాయిలో అవసరమైన 643 వెరిఫికేషన్ బందాలను సిద్ధం చేశామన్నారు. నక్షా కార్యక్రమం పూర్తయితే పట్టణాలకు సరైన ప్రణాళిక , పన్నుల విధింపుతో పాటు ఆస్తుల వివాదాల కు చెక్ పెట్టవచ్చన్నారు. కేంద్రం తో కలిసి భూముల సర్వేకు అధిక ప్రాధాన్యత ఇచ్చి విజయవంతంగా నక్షా కార్యక్రమం నిర్దేశిత సమయంలో పూర్తి చేస్తామన్నారు.

కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రటరీ మనోజ్ జోషి మాట్లాడుతూ నాణ్యమైన భూ రికార్డులు నిర్వహించే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ దాదాపు రూ.1000 కోట్ల వరకు ప్రోత్సాహక నిధులను అందిస్తుందన్నారు. ఆర్వోఆర్ లో 80 శాతంకు పైగా వ్యక్తిగత ఖాతాలు ఉంటే దానిని నాణ్యమైన భూ రికార్డులుగా గుర్తించటం జరుగుతుందన్నారు. అంధ్రప్రదేశ్ లో 90 శాతం పైగా డిజిటలైజ్డ్ చేసిన భూ ఖాతాల్లో వ్యక్తిగత ఖాతాలు ఉండటంతో అత్యధికంగా ప్రోత్సాహక నిధులు అందుకోవటం జరిగిందన్నారు. ఆర్వోఆర్‌లో జాయింట్ ఖాతాలు ఉండటం వల్ల మ్యూటేషన్ ఇబ్బందులు ఉంటాయని, స్థలాలు అమ్ముకున్న వ్యక్తిగత ఖాతాలుగా మార్పు చేయటం కుదరటం లేదన్నారు. దేశంలో అంధ్రప్రదేశ్, గుజరాత్ , రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో భూముల రీ సర్వే వేగంగా జరుగుతుందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో వివిధ కారణాలతో ఆశించిన స్థాయిలో రీ సర్వే జరగటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి కేంద్ర భూ వనరుల శాఖ సర్వే, రీ సర్వే, నక్షా కార్యక్రమాలకు దేశంలో వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న నిధులు, ప్రోత్సాహకాలపై బీహార్, లడక్, ఒడిస్సా, హర్యాన, త్రిపురా రాష్ట్రాలలో జరుగుతున్న భూముల రీసర్వే సంబందిత రాష్ట్రాల సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు భూముల రీ సర్వేకు సంబంధించి తెలిపిన అనేక సందేహాలకు కేంద్ర భూ వనరుల శాఖ అధికారులు నివత్తి చేశారు. కేంద్ర భూ వనరుల శాఖ డైరక్టర్ శ్యామ్ కుమార్, ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ, గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన సర్వే ల్యాండ్ రికార్డ్సు ఉన్నతాధికారులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్‌ఎస్‌కె ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసులు, సర్వే ల్యాండ్ రికార్డ్సు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డికె పట్టా రైతులకూ అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ అన్నదాత సఖీభవ పథకం కోసం సచివాలయంలో సంబంధిత పత్రాలు అందజేయాలని ప్రభుత్వ సూచన మేరకు పమిడిమర్రు రైతులు పత్రాలతో సచివాలయం వద్దకు వెళితే అనర్హులని అధికారులు చెప్పారన్నారు. గతంలో ఆ భూములు సాగుకు అనుకూలంగా లేకపోవడంతో మొత్తం చెరువుగా మార్చి



తహశీల్దార్ కె.వేణుగోపాలరావు కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లీజుకు ఇచ్చారని, తద్వారా రైతులు కొంత ఆదాయం పొందారని చెప్పారు. ప్రస్తుతం చేపల చెరువులు కాకుండా సాగుకు అనుకూలంగా మార్చుకుని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో రైతులు క్రమంగా సాగుకు దూరం అవుతున్న క్రమంలో రైతుల్ని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం పథకానికి అనర్హులుగా ప్రకటించడం సరికాదన్నారు. ఈ ఏడాది రైతులు సాగు చేసిన ఏ ఒక్క పంటకూ మద్దతు ధరలు దక్కక రైతులు నష్టాల ఊబిలో చిక్కుకొని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులను తగ్గించేందుకే ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు రైతులను అనర్హులుగా ప్రకటిస్తున్నారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా డికె పట్టాలు పొంది పూర్తి హక్కులు కలిగిన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సిఐటియు నాయకులు ఈవూరి మస్తాన్‌రెడ్డి, గ్రామ మహిళా రైతులు, రైతులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ పనులు త్వరగా చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

త్వరితగతన పనులను పారంభించాలన్నారు. గుంటూరు ఛానల్ అభివృద్ధి పనులలో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులకు తగ్గట్టుగా పనులు ప్రారంభించాలన్నారు. గుంటూరు, బాపట్ల జిల్లాలకు ప్రాంతాలకు ఉపయోగపడేలా గుంటూరు ఛానల్ విస్తరణ అభివృద్ధి పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. భూ సేకరణకు నిధులు అందుబాటులో ఉన్నందున వెంటనే సర్వే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థ చేపట్టాలన్నారు. ఛానల్ విస్తరణ, పొడిగింపునకు సంబంధించి అధికారులు ఎప్పటికప్పుడు తగిన ప్రణాళికతో పని చేయాలని సూచించారు.

గ్రామాభివృద్ధిని ప్రోత్సహించేందుకే పల్లెనిద్ర

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు - అలవాల గ్రామంలో పల్లెనిద్ర

ప్రజాశక్తి-పల్నాడు జిలా

గ్రామాభివృద్ధిని ప్రోత్సహించేందుకే ప్రభుత్వం పల్లెనిద్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం రాత్రి రొంపిచర్ల మండలం అలవాల గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ టిడిపి నాయకులతో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యాలను, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అరాచకాలపై మండిపడ్డారు. స్వార్ధ రాజకీయాల కోసం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గ్రామాలలో వివాదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గ్రామ టిడిపి నాయకులు మాజీ ఎంపిపి వెన్నా బాలకోటి రెడ్డిని వైసిపి నాయకులు అత్యంత కిరాతకంగా హత్య చేయడం బాధాకరమన్నారు. వెన్నా బాలకోటి రెడ్డి కుటుంబం రానున్న సోమవారం మంత్రి లోకేష్ ను కలవనున్నట్లు తెలిపారు. కూటమి పాలనలో ప్రజలు ప్రశాంతంగా సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజావేదిక, పల్లెనిద్ర వంటి కార్యక్రమలు చేపడుతూ, పట్టణంలో ప్రతి రోజు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో ప్రజలు సోదరభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రొంపిచర్ల మండల అధ్యక్షులు పులుకూరి జగ్గయ్య కార్యదర్శి పల్లెల నాగిరెడ్డి టిడిపి అధిక సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

164వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎసిసి సిమెంట్ కంపెనీ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారం 164వ రోజులకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలో డి.స్వర్ణకుమారి, డి.రమణమ్మ, డి.మల్లేశ్వరి, వేముల లక్ష్మీ, ఎం.శారద పాల్గొన్నారు. వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, నీరు దుర్గారావు, బి.సూర్యప్రకాష్, వై.సాంబయ్య, షేక్ ఇస్మాయిల్, సుబ్బారావు, రమాదేవి, ఇమాంబి, తుపాకుల నాగేశ్వరరావు, టి.దుర్గాభవాని, ఎం.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

వైసిపి మండల అధ్యక్షునిగా చల్ల హనుమంతు యాదవ్



ప్రజాశక్తి - ప్రత్తిపాడు : వైసిపి మండల అధ్యక్షునిగా చల్ల హనుమంతు యాదవ్‌ను నియమించినట్లు ఆ పార్టీ శుక్రవారం క్రటించింది. మండల అధ్యక్ష పదవి తనకు రావడంలో సహకరించిన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలసాని కిరణ్‌కుమార్‌కు హనుమంతు యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

దేవుడి మాన్యంలో ప్లాట్లు ఇవ్వండి

సీడ్ యాక్సెస్ రోడ్డు బాధిత రైతులు

ప్రజాశక్తి- తాడేపల్లి

రాజధానిలో సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణానికి భూములు ఇవ్వడానికి ఉండవల్లి రైతులకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే భూములు ఇచ్చిన రైతులకు ఉండవల్లి దేవుడు మాన్యంలోగాని, టు వన్ జోన్‌లో గాని అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రాజధాని రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు కే ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఉండవల్లిలో బాధ్యత రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర రావు మాట్లాడుతూ గ్రామాల్లో విధించిన వివిధ రకాల జోన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. భూములు అన్ని రకాల నిర్మాణాలు చేసుకునే విధంగా భూ యజమానులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. బలవంత భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ నిధులు రైతులు ఖాతాల్లో రూ.20వేలు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ పోలింగ్‌లో ఇచ్చిన రైతుల భూముల ప్లాట్లు వెంటనే అభిద్ధివృద్ధి పరిచి అప్పగించాలని కోరారు. ప్రముఖ డాక్టర్ కన్నారావు నాయుడు మాట్లాడుతూ ఉండవల్లి రైతుల భూములపై కోర్టు స్టే ఉందని, రైతుల అధైర్య పడద్దని సూచించారు. సమావేశంలో ఎం అంజిరెడ్డి, డి సాంబశివరావు, అరవింద్ రెడ్డి, టి బక్కి రెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు. ఉండవల్లిలో సీడ్ యాక్సెస్ రోడ్డు రైతుల సమావేశం ఈరోజు ఉండవల్లి లో రైతు సంఘం రాజధాని డివిజన్ అధ్యక్షులు కే.ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ సీడ్ యాక్సెస్ రోడ్డు కి భూములు ఇవ్వటానికి రైతులకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఇచ్చిన భూములకు తమ గ్రామం యువన్ జోన్‌లో గాని దేవుడి మాన్యంలో గాని ప్లాట్లు ఇవ్వవలసిందిగా డిమాండ్ చేశారు అలాగే గ్రామాలను అన్ని జోన్లను ఎత్తివేయాలని కోరారు




మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

మిగిలిన మా భూములలో మల్టీపర్పస్‌గా అన్ని విధాల అనుమతులను ఇవ్వవలసినదిగా కోరారు. ఈనెల 20న రైతాంగ సమస్యలపై గళమెత్తి బలవంతపు సమీకరణ భూసే కరణ ఆపాలని ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ నిధులు 20వేల రూపాయలు ఖరీఫ్ నాటికి రైతుల ఖాతాలో జమ చేయాలని పంటల భీమా ప్రభుత్వమే చెల్లించాలని రాజధానిలో ల్యాండ్ పూలింగ్ ఇచ్చిన రైతుల భూముల ప్లాట్ లను వెంటనే అభివద్ధి పరిచి రైతులకు చూపించవలసినదిగా కోరారు రెడ్డి మాట్లాడుతూ బలవంతంగా రైతుల నుండి భూములను తీసుకోవద్దని కోరారు ఉండవల్లి గ్రామం రాజధానికి ముఖద్వారంగా ఉన్నది విజయవాడ సమీపంలో ఉండటం గతంలో ధరల గణనీయంగా ఉన్న సందర్భంలో ధరల వ్యత్యాసాన్ని ప్రస్తుత ధరలు తాడేపల్లి ప్రాంతంలో 20 30 కోట్ల పలుకుతా ఉంటే మా ప్రాంతంలో ఐదు ఆరు కోట్ల మాత్రమే ధర పలుకుతా ఉంది దీనికి ప్రధాన కారణం తాడేపల్లి లాగా బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు లేకపోవటమే తక్షణమే బహుళ అంతస్తులు భవనాలకు అనుమతులు ఇవ్వవలసిందిగా కోరడమైనది ప్రముఖ డాక్టర్ కన్నారావు నాయుడు మాట్లా డుతూ ఉండవల్లి పరిధిలో సీడ్ యాక్సెస్ రోడ్డు రైతుల భూములు స్టేలో ఉన్న కారణంగా రైతులు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు ఇంకా సమావేశంలో మున్నంగి అంజిరెడ్డి దండమూడి సాంబశివరావు కళ్ళం అరవిందరెడ్డి బక్కిరెడ్డి వీరాస్వామి పాల్గొన్నారు

సూర్య ప్రతాపం నుంచి ఊరట

ప్రజాశక్తి - తాడికొండ

పగలు సూర్యుడు ప్రతాపంతో ఉక్కిరి బిక్కిరి అయిన తాడికొండ మండల ప్రజలకు గురువారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కాస్త ఊరట కలిగించే విధంగా ఉన్నట్టుండి ఆకాశం కారుమబ్బులతో కప్పబడింది. ఉరుములు మెరుపులతో ఆకాశానికి చిల్లులు పడ్డాయన్న చందంగా వర్షం కురిసింది. మండల ప్రజలు ఎన్నడూ విననంతగా పిడుగుల శబ్దం, పిల్లలే కాదు పెద్దల గుండెలు సైతం అదిరిపోయే శబ్దాలతో మన పక్కనే పడ్డాయేమో అన్నచందంగా పిడుగులు పడ్డాయి. వర్షం ప్రారంభం కావడంతో రాత్రి 2.30 నుండి ఉదయం 8.30 వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడింది. ఇటీవల కాలంలో ఇటువంటి పిడుగుల శబ్దాలు వినలేదని వద్ధులు సైతం గుర్తు చేసుకున్నారు ఆపరేషన్ సింధూర్లో లో ఇటువంటి శబ్దాలు ఉన్నాయో లేదో కానీ రాత్రి మేము అనుభవించామని గ్రామస్తులు తెలిపారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



కరెంటు తీగలపై పడిన చెట్టును కత్తిరిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఈదురుగాలుల బీభత్సం

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురు గాలులతో వర్షం సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. ఆటోనగర్ సమీపంలో చెట్ల కొమ్మలు విరిగి ట్రాఫిక్కు కొంతమేర ఆటంకం కలిగించాయి. పెదకాకాని, నంబూరు పరిసర గ్రామాలలో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ ప్రసారానికి అంతరాయం కలిగించాయి. పెదకాకాని శివాలయంలో చెట్ల కొమ్మలు విరిగి ఆలయ పరిసరాల మొత్తం చిందరవందరగా చేశాయి. గుంటూరు నందివెలుగు రోడ్డులో చెట్లు విరిగి పడి వాహన చోదకులకు అంతరాయం కలిగించాయి. మండల పరిధిలోని రహదారి ప్రక్కన ఏర్పాటు చేసిన వివిధ ప్రకటన హోర్డింగులు విరిగి గాలికి కొంతమేర కొట్టుకుపోయాయి. శివారు కాలనీలో గుడిసెలు వేసుకున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు చెట్ల కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడంతో సమస్యను త్వరిత గతిన పరిష్కరించారు.

యడ్లపాడులో దొంగలు హల్ చల్

రెండు ఇళ్లలో చోరీ - ఆభరణాలు, నగదు మాయం

ప్రజాశక్తి - యడ్లపాడు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. రెండు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని భారీగా చోరీ చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. బాధితుల వివరాలు, పోలీసుల ప్రాథమిక విచారణ ఆధారంగా ఈ ఘటన గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో చోటుచేసుకున్నట్లు గుర్తించారు. గ్రామానికి చెందిన నర వారి హనుమాన్ సింగ్ అనే గృహ యజమాని తన వృత్తి నిమిత్తం వాహన డ్రైవర్‌గా వెళ్లి అర్ధ రాత్రి ఇంటికి చేరుకున్నాడు. తలుపు తాళం పగలగొట్టినట్లు గమనించి లోపలికి వెళ్లి చూశారు. ఇంట్లో సామానంతా చిదరవందరగా కనిపించింది. ఇంట్లో దొంగతనం జరిగినట్లు గమనించి పోలీసులు సమాచారం అందించాడు బాధితుడు హనుమాన్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ సభ్యులంతా పని నిమిత్తం ఊరికి వెళ్లిన నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ దోపిడి జరిగింది. సంఘటనలో రూ.20 వేల నగదు, 50 తులాల వెండి, 9 గ్రాముల బంగారు ఆభరణాలు, పిల్లల ఉంగరాలు, చెవి దిద్దులు వంటి విలువైన వస్తువులను అపహరణకు గురైనట్లు వెల్లడించాడు. ఇదే సమయంలో ఇంటి ఎదురుగా ఉన్న దండ ప్రమీల ఇంట్లో కూడా దుండగులు చోరీకి యత్నించినట్లు సమాచారం. తాళం పగలగొట్టి లోపలకి వెళ్లినా, అక్కడ విలువైన వస్తువులు కనిపించకపోవడంతో దొంగలు అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ప్రమీల గ్రామంలో లేరు. కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా ఆమెను సంప్రదించి వివరాలు సేకరించారు. సమాచారాన్ని అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీమ్ సాయంతో ఆధారాలను సేకరిస్తున్నారు. రెండు ఇళ్లలో కూడా ఒకే విధంగా తాళాలు పగలగొట్టిన విధానం చూసి ప్రొఫెషనల్ దుండగులు అయి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. గ్రామంలో ఇటువంటి దొంగతనాలు పెరుగుతుండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. రాత్రి సమయంలో గస్తీ పెంచాలని, విచారణను వేగవం తం చేసి దోషులను తక్షణమే పట్టుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు.

కౌల్దార్లకు 31లోపు గుర్తింపు కార్డుల జారీ

ప్రజాశక్తి -దుర్గి

కౌలురైతులకు గుర్తింపు కార్డులను ఈనెల 31వ తేదీలోపు అందిస్తామని మండల వ్యవసాయాధికారి అమీర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అర్హులు వ్యవసాయాధికారి, తహశీల్దార్ కార్యాలయాల్లో లేదా రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. కార్డు కావాల్సిన కౌల్దార్లు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రైతు ఆధార్ కార్డు, పొలం కౌలుకు ఇచ్చిన ఒప్పంద పత్రం, రైతు సంతకం లేదా వేలిముద్ర, కౌలుదారు ఫొటోతో దరఖాస్తును పూర్తి చేసి విఆర్‌ఒ లేదా రైతుసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేయించుకోవాలని చెప్పారు. గతంలో కార్డులు తీసుకున్న వారు రెన్యూవల్ చేయించుకోవచ్చన్నారు.

యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, జెవివి ఆధ్వర్యంలో
ఉచిత పాలిటెక్నిక్ శిక్షణకు విశేష స్పందన
2025లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, జెవివి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతుల్లో తర్ఫీదు పొందిన విద్యార్థులు 2025 ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు శిక్షణ తరగతుల కో-ఆర్డినేటర్ యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ 2025 ఫలితాల్లో 120 మార్కులు గాను 115 మార్కులతో 455 రాష్ట్రస్థాయి ర్యాంకును కె.హేమంత్ కుమార్, 114 మార్కులతో 686 రాష్ట్రస్థాయి ర్యాంకు షేక్ జాస్మిన్ సాధించారని తెలిపారు. వి.నేహా సర్వాణి 1153వ ర్యాంక్, ఎం.హర్షవర్ధన్ 1289వ ర్యాంక్, పి.హర్షవర్ధన్‌రెడ్డి 2147వ ర్యాంక్, ఎం.భార్గవి 2397వ ర్యాంక్, యు.అఖిల 3844 ర్యాంక్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు వివరించారు. ఈ శిక్షణ తరగతులు నందు మొత్తం 140 మంది విద్యార్థులకు గాను ఐదు వేలలోపు ర్యాంకులు 10 మంది విద్యార్థులకు, 10 వేల లోపు ర్యాంకులు 15 మంది విద్యార్థులు సాధించారని అన్నారు. ఏప్రిల్ 4వ తారీఖు నుండి 28వ తారీకు వరకు 25 రోజులు పాటు నిర్విరామంగా అనుభవజ్ఞులైన ప్రభుత్వ ఉపాధ్యాయులచే ప్రణాళిక బద్ధంగా శిక్షణిచ్చామని, ప్రతిరోజూ డైలీ టెస్టులతో, వారాంతంలో వీక్లీ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహించామని పేర్కొన్నారు. గత మూడేళ్ల కాలంలో ప్రతి సంవత్సరం 150 మంది విద్యార్థులకు తగ్గకుండా ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించామని, వీటిని ఉపయోగించుకొని ఉత్తమ ర్యాంకులు సాధించి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లను విద్యార్థులు పొందారని యుటిఎఫ్ పిడుగురాళ్ల మండల అధ్యక్షులు ఎస్‌వి.సాంబశివరావు తెలిపారు. లయోలా కళాశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి ఉచిత శిక్షణ తరగతులు నందు 150 మంది విద్యార్థులకు ఉచితంగా పాలిటెక్నిక్ పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను యుటిఎఫ్ పల్నాడు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి అభినందించారు. కార్యక్రమంలో పలనాడు జిల్లా యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు కాసింపీర, జిల్లా కార్యదర్శి జమాల్, మండల గౌరవాధ్యక్షులు రమణ నాయక్, ప్రధాన కార్యదర్శి గోను ప్రసాద్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు డి.సాయిబాబు, ఎస్ఎఫ్ఐ, జెవివి బాధ్యులు పాల్గొన్నారు.



ఊరుగాని ఊర్లో బతుకు పోరాటం

- పనికోసం అడ్డాలపై స్థానికులతోపాటు వలస కూలీలు
- మిల్లుల మూతతో రోడ్డునపడ్డ జీవితాలు
- సొంత రాష్ట్రాలకు వెళ్లలేక ఇక్కడే జీవన సమరం


పనుల కోసం అడ్డాపై నిరీక్షిస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మిల్లులను నమ్ముకుని ప్రాంతంగాని ప్రాంతానికి వలసొచ్చిన కుటుంబాలు ఉపాధి కష్టాలు పడుతున్నాయి. మిల్లులు మూతబడటంతో సొంతూళ్లకు వెళ్లలేక.. ఇక్కడ పని దొరక్క నిత్యం సతమతం అవుతున్నారు. అడ్డాలపై పనికోసం నిరీక్షిస్తూ ప్రతిరోజూ పరీక్షను ఎదుర్కొంటూ జీవన సమరం చేస్తున్నాయి.

స్థానిక గణపవరంలోని పత్తి, నూలు, స్పిన్నింగ్, గ్రానైట్ తదితర మిల్లుల్లో పనుల కోసం ఒరిస్సా, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుండి వందల కుటుంబాలు ఎనిమిదేళ్ల కిందట వలసొచ్చాయి. వివిధ కారణాలతో మిల్లులు మూత బడడంతో కొంతమంది సొంతూళ్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా దాదాపు 5 వేల మంది వరకు ఇక్కడే ఏదో ఒక పని చేసుకుంటూ కాలం గడుపుతున్నారు. స్థానిక కూలీలతోపాటు వీరుకూడా చిలకలూరిపేట పట్టణంలోని అడ్డాల్లో ప్రతిరోజూ ఉదయం వచ్చి పనుల కోసం నిరీక్షిస్తుంటారు. ఎవరైనా పనికి తీసుకెళ్తే ఆ రోజు కూలి లేకుంటే ఉట్టిచేతుల్తో వెనక్కు వెళ్లాల్సిందే. వీరికి తెలుగు పూర్తిస్థాయిలో రాని కారణంగా పనులు కోల్పోయిన, తక్కువ కూలీ తీసుకోవాల్సిన సందర్భాలు అనేకం ఉంటున్నాయి. మిల్లుల్లో పని చేస్తున్న కాలంలో వీరికి క్వార్టర్స్‌లోనే ఉచిత వసతి అవకాశం ఉండేది. ప్రస్తుతం రూ.మూడు నాలుగు వేలకు చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇదికూడా వారికి ఆర్థిక భారమైంది. కొన్ని సందర్భాల్లో పనులు దొరక్క అద్దెలూ చెల్లించలేకపోతున్నారు. ఏళ్ల తరబడి ఇక్కడే ఉంటున్న తమకు రేషన్, ఇతర పథకాలు వర్తింపజేయాలని వలస కూలీలు కోరుతున్నారు.

ఒక్కోసారి పస్తులు

కంగాధర్ మల్లి, ఆశిక్,, బొర్గాడ్ జిల్లా, కాంపడ గ్రామం, ఒరిస్సా.

భార్య, ఇద్దరు పిల్లల్తో 8 ఏళ్ల క్రిత ఒక మిల్లులో పనికి వచ్చాం. ఆ మిల్లు మూత పడింది. సొంతూరెళ్లినా పని సరిగా ఉండదు. అందుకే ఇక్కడే ఉంటూ ఏదో పని చేసుకుంటున్నా. రోజూ పనులు ఉండడం లేదు. కొన్నిసార్లు పని వద్దకు వెళ్లినా భాష రాకపోవడం వల్ల పని నుండి వెనక్కు రావాల్సి వస్తోంది. కూలికూడా తక్కువ ఇస్తుంటారు. వచ్చే కూలి కుటుంబ పోషణకు సరిపోక, అద్దెలు కట్టడం కూడా కష్టమవుతోంది. ఒకోసారి పస్తులూ ఉంటున్నాం. నాకేమైనా అయితే కుటుంబం పరిస్థితి ఏమిటి అని ఒక్కోసారి భయమేస్తుంది.




అన్న క్యాంటీన్ పెట్టాలి

మహిళా కార్మికురాలు, ఉత్తర్‌ప్రదేశ్.

భవన నిర్మాణం, వ్యవసాయం ఇలా ఏ పని ఉంటే ఆ పనికి వెళ్తున్నా. పని ఉంటే రూ.500-700 వరకు కూలి వస్తుంది. సంపాదనలో ఎక్కువ భాగం ఆహార అవసరాలకే అయిపోతోంది. ఒక అన్న క్యాంటీన్‌ను గణపవరం సెంటర్‌లో కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. సరుకుల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. మాకు కూడా ఇక్కడే గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులివ్వాలి.

గుర్తింపు కార్డులివ్వాలి

పి.వెంకటేశ్వర్లు, సిఐటియు మండల కార్యదర్శి

వలస కార్మికులను ప్రత్యేకంగా గుర్తించి వారికి గుర్తింపు కార్డులివ్వాలి. రేషన్ కార్డులు మంజూరు చేసి ప్రభుత్వ పథకాలు కూడా వర్తింపజేయాలి. మూతబడ్డ కంపెనీలను పున:ప్రారంభించగలిగితే వారికి ఉపాధి సమస్య తప్పుతుంది. ప్రభుత్వం, స్థానిక నాయకులు అందుకు చర్యలు తీసుకోవాలి. దానివల్ల ఆర్థికంగానూ ఈ ప్రాంతానికి ఎంతో ఉపయోగం.

మిల్లుల్ని తెరిపించాలి

ఎం.రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి.

పారిశ్రామిక పల్లెగా పేరుగాంచిన గణపవరం ఏపీతోపాటు అనేక రాష్ట్రాల కార్మికులకు జీవనోపాధి కల్పించేది. ప్రభుత్వ విధానాల వల్ల స్పిన్నింగ్, జిన్నింగ్, కాటన్, పొగాకు పరిశ్రమలు మూతపడి వేలాది మంది జీవనోపాధి కోల్పోయి రోడ్డు పాలయ్యారు. ఈ పరిస్థితిని ప్రభుత్వాలు చక్కదిద్దాలి.


వివరాలు చెబుతున్న కబడ్డీ పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు

నేటి నుండి కబడ్డీ పోటీలు

ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో మూడ్రోజుల పాటు నిర్వహణ - 19న బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కమ్యూనిస్టు యోధుడు పుచ్చల పల్లి సుందరయ్య 1959, 60 సంవత్సరాల్లో వడ్డాని అయ్యన్న (తూర్పు మాలపల్లి) ఇంటి వద్ద జెండాను ఆవిష్కరించారని, దానికి గుర్తుగా ఇక్కడ ప్రతిఏటా సుంద రయ్య వర్ధంతితోపాటు ఆయన పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహి స్తున్నామని నిర్వహణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.లూథర్, ఎస్.బాబు శుక్రవారం తెలి పారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా వచ్చే సోమ వారం సభతోపాటు జెండావిష్కరణ ఉంటుంద న్నారు. ఇందులో భాగంగా శని, ఆది, సోమవారాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను చంద్రమౌళి పార్క్‌లో నిర్వహిస్తామని చెప్పారు. విజేతలకు బహుమ తులను 19న పిల్లి అంకమ్మ చౌక్ వద్ద నిర్వహించే సభలో ప్రదానం చేస్తామని, పోటీల్లో పాల్గొనే జట్టు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. మొదటి బహుమతి రూ.20 వేలను సాతులూరి రామయ్య, రామకోటమ్మ జ్ఞాపకార్థం ప్రదానం చేస్తారని, రెండో బహుమతి రూ.15 వేలను సాతులూరి అంజయ్య, అంజమ్మ, సాతులూరు చలమయ్య, అంజమ్మ జ్ఞాపకార్థం, మూడో బహుమతిని కొర్రపాటి కృపారావు సరోజ జ్ఞాపకార్థం, నాలుగో బహు మతి కొప్పుల ఎరుకలు, కోటమ్మ జ్ఞాపకార్థం ప్రదానం చేస్తారని వివరించారు. క్రీడాకారులకు ఉచిత భోజన, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వివరాలకు సాతులూరి హనుమంతరావు : 9849794238, సాతులూరి ప్రకాష్ : 996337396, పి.శివగణేష్ : 635407457 సెల్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.



కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో 21న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న నరసరావుపేట పట్టణం సమీపంలో చిలకలూరిపేట రోడ్డులో గల తమ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను శుక్రవారం నరసరావుపేటలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కళాశాల డైరెక్టర్లు కె.నాసరయ్య, కె.వీరరాఘవులు, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు విసి హెచ్.రామాంజనేయులు, ఎం.వీరాంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాబ్ మేళాలో సుమారు 20 కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ చదువుకున్న నిరుద్యోగ యువత, తమ విద్యార్హత పత్రాలు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ యువతీ యువకులు ఉపయోగించుకోవాలని, మరిన్ని వివరాలకు 9160031006, 9160200652, 9866929567 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.









విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపాలు, బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఉరికే ఉత్సాహం.. మెరిసే చైతన్యం

- అల్లూరి- భగత్ సింగ్ వారసులం మేమే
- యువతరం మేమే - నవశకం మాదే
- ఉర్రూతలూగించిన చిన్నారుల ప్రదర్శనలు



ప్రజాశక్తి- తాడేపల్లి

ఊరికే ఉత్సాహం - మెరిచే చైతన్యం- అల్లూరి- భగత్ సింగ్ మేమే - నవ శకం మాదే - యువతరం మాదే అంటూ సాగిన జానపద గీతం యువతీ యువకులతో పాటు తిలకించటానికి వచ్చిన ఆహుతులను కూడా అబ్బురపరిచింది. చూపు పక్కకు మరలచకుండా చిన్నారులు ప్రదర్శించిన స్వాతంత్ర పిపాసను రగిలించింది. తాడేపల్లి బైపాస్ రోడ్డు అమరావతి ఐకాన్‌లో మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 28వ తేదీ నుండి మే 15వ తేదీ వరకు జరిగిన పిల్లల వేసవి శిక్షణ శిబిరం (గణితంలో మెలుకువలు, డాన్స్) శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఐకాన్‌లోని క్లబ్ హౌస్ కింద ముగింపు, బహుమతి ప్రధానోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా శిక్షణలో నేర్చుకున్న వివిధ నృత్య రూపాలను బాల బాలికలు ప్రదర్శించారు. నాలుగు సంవత్సరాల నుండి 8 సంవత్సరాలలోపు బాలబాలికలు ప్రదర్శించిన జుమ్మా డాన్స్‌తో అదరగొట్టారు. కళ్ళజోడు కాలేజీ పాప చూడు అంటూ మ్యాడ్ వేస్ట్ సాంగ్ ప్రదర్శించిన చిన్నారి హాసినికి సబికుల నుండి మంచి స్పందన వచ్చింది. అప్పడి పొడి వెస్టన్ సాంగ్ పాటకు చిన్నారులు చేసిన నృత్యం వారేవా అనిపించింది. సంప్రదాయ బద్ధమైన గోదారి గట్టుమీద రామచిలుకవే పాటకు పిల్లలు ప్రదర్శించిన అభినయం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. చిన్నారులు ఇస్మార్ట్ శంకర్ పేరుతో ప్రదర్శించిన మ్యూజిక్ రాక్ స్టార్ అలరించింది. ఇవి గాక కుర్చీలాట లో పిల్లలు మరంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లలతో పాటు వచ్చిన తల్లిదండ్రు లు, మరియు అపార్ట్మెంట్ వాసులు అసాంతం మూడు గంటల పాటు సాగిన కార్యక్రమాలను తిలకించి పిల్లల సంతోషంలో పాలుపంచుకున్నారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాలబాలికలు అందరికీ బహుమతులు అందజేశారు.

పిల్లలు పుస్తకాలు చదవాలి.. అప్పుడే సమాజం అర్థమవుతుంది

విద్యార్థినీ విద్యార్థులు చిన్నతనం నుండి పాఠ్య పుస్తకాలతో పాటు చరిత్రకు సంబంధించిన పుస్తకాలు చదవాలని, అప్పుడే గతం ప్రస్తుతం చరిత్ర అర్థమవుతుందని పలువురు వక్తలు చెప్పారు. తాడేపల్లి బైపాస్ రోడ్డు అమరావతిలో గత నెల 28వ తేదీ నుండి ఈ నెల 15వ తేదీ వరకు జరిగిన పిల్లల వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు, బహుమతి ప్రధానోత్సవం సభలో రోటరీ క్లబ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వినోద్ కుమార్, అమ్మ కళ్యాణమండపం, విజయవాడ పూర్వ అధ్యక్షులు యార్లగడ్డ సుబ్బారావు, గణితం మాస్టర్ ఎన్.లెనిన్ బాబు, వేసవి శిక్షణ శిబిరం బాధ్యులు ఎం.మనోహర్ రెడ్డి మాట్లాడారు. పిల్లలు కథలు పుస్తకాలు చదవాలని, అందులో ఉన్న నీతి సూత్రాలు జీవితంలో ఉపయోగపడతాయని చెప్పారు. చందమామ, బాలమిత్ర లాంటి పుస్తకాలు పిల్లల ముంగిటకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. పుస్తక పఠనం ఎంతో మంచిదని, సబ్జెక్టుకు సంబంధించి పుస్తకాలు మరింత లోతుగా అధ్యయనం చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు, సమ్మర్ క్యాంప్ విజయ వంతం కావడానికి సహకరించిన అమరావతి ఐకాన్, మరియు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి వారికి ఎంటిఎంసి బాలోత్సవం తరఫున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఫౌండర్ మరియు చైర్మన్ గోపు నాగ రాజేష్, ఓబులారెడ్డి, డాన్స్ మాస్టర్ చందు, సిహెచ్. శివరామిరెడ్డి, వై.బర్నబాస్, డి.కోదండ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు

వైష్ణవి జూనియర్ కళాశాలకే సొంతం



వైష్ణవి కళాశాల భవనం

ప్రజాశక్తి - తెనాలి

సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు.. ఇంటర్ విద్యలో వినూత్న ప్రయోగాలు.. ఏళ్ళ తరబడి అప్రతిహతంగా సాగుతున్న ప్రయాణం, పట్టణ పరిసర ప్రాంతాల్లో తన కంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకుని, పేద మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటైన ఫీజులతో అత్యుత్తమ ఫలితాలకు వేదికగా నిలుస్తోంది. ఇంటర్‌తోనే హెచ్‌సిఎల్ వంటి ప్రతిష్టాత్మకమైన ఐటి కంపెనీలో ఉద్యోగాల కల్పనకూ వేదికైన స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల వివరాలిలా ఉన్నాయి.

పట్టణ, పరిసర ప్రాంతాలకు సుపరిచితమైన కళాశాల వైష్ణవి జూనియర్ కళాశాల. తల్లి దండ్రులు, విద్యార్థుల ఆశయాలకు అనుగుణంగా విద్యాబోధనలో నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేస్తోంది. ఇంటర్ ఎంపిసి, బైపిసి, ఎంఈసీ, సిఇసి గ్రూపులతో తెలుగు, ఇంగ్లీషీ మీడియంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, విద్యారంగంలో మారుతున్న పాఠ్యప్రణాళికలకు అనుగుణంగా బోధన కళాశాల ప్రత్యేకతలుగా ఉన్నాయి. అధిక సంఖ్యలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే సాధారణ విద్యార్థులతో అసాధారణమైన ఫలితాలు సాధిస్తోంది. సైన్స్ పాఠ్యాంశాల్లో సబ్జెకు నిపుణుల పర్యవేక్షణలో ప్రాక్టికల్స్ నిర్వహణకు అత్యాధునిక లేబొరేటరీ, పాఠ్యాంశాలను నెమరు వేసుకునేందుకు విశాలమైన గ్రంథాలయం అందుబాటులో ఉన్నాయి. అందుబాటులో ఫీజులు, ప్రత్యేకమైన ప్రణాళికతో విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహణ, అనుభవజ్ఞులైన పర్యవేక్షకుల సమక్షంలో విద్యార్థులకు పాఠ్యాంశాలలో సందేహాలను నివృత్తి చేయటం, వారాంతపు పరీక్షలు, విద్యార్థుల ప్రగతి నివేదికను తల్లిదండ్రులకు నివేదించటం కళాశాల ప్రత్యేకతగా చెప్పొచ్చు.

ఉత్తమ ఫలితాల సాధనలో మేటి

కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల కృషితో 2025 మార్చిలో ఇంటర్ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో 1000 మార్కులకు కె.రాజేశ్వరి 986, జె.వి.వి.నాగసాయి, డి.లోకేష్ వర్మ 962, కె.అలేఖ్య 957 మార్కులు సాధించారు. అలాగే సీనియర్ బైపిసి విభాగంలో జెవిఎల్ శ్రీదుర్గ 982, ఎం.లాలుప్రసాద్ 978, జి.శోభ 966 మార్కులు సాధించారు. సిఈసీలో కె.శ్రీరామ్, డివివిఎస్ రాంచరణ్ 955 మార్కులు పొందారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి విభాగంలో కె.శిరీష, వి.జానకి రామ్ 459 మార్కులు, షేక్ సమీనా 455, బైపిసిలో పి.మేరిమహిత 434, సిఇసిలో సిహెచ్ కీర్తిచందన 485, ఎంఈసిలో టి.తన్విత 478 మార్కులతో సత్తా చాటారు.





ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులు కె.రాజేశ్వరి, లక్ష్మి శ్రీ దుర్గ



హెచ్‌సిఎల్ ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థులతో కరస్పాండెంట్

ఇంటర్‌తో హెచ్‌సిఎల్ ఐటి కంపెనీలో ఉద్యోగాలు

కళాశాలలో విద్యతో పాటు ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తున్నారు. ప్రముఖ ఐటి కంపెనీ హెచ్‌సిఎల్‌లో ఉద్యోగాల కల్పనకు యాజమాన్యం కృషి చేస్తోంది. ఫలితంగా విద్యార్థులు ఉపాధి పొందుతూ ఉన్నత విద్యకు అవకాశం లభిస్తుంది. గతేడాది అంటే 2024-25 విద్యాసంవత్సరంలో 24 మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

విద్యాప్రమాణాల్లో ఎక్కడా రాజీ ధోరణి లేదు

విద్యాప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా తమ కళాశాలలో విద్యాబోధన చేస్తున్నాం. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. సాధారణ విద్యార్థులతోనే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. అత్యాధునిక లేబొంటరీ, లైబ్రరీ అందుబాటులో ఉంది. అన్నివిదాలా విద్యార్థుల ప్రయోజనాలను కాపాడతాం. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉత్తమ ఫలితాల సాధనకు అహర్నిశలూ శ్రమిస్తున్నాం. సాధిస్తున్నాం.

- పాటిబండ్ల శ్రీనివాసరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్

20న గ్రామ సచివాలయాల వద్ద ధర్నా

రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

రైతుల సమస్యలు పరిష్కరించాలని జిల్లావ్యాప్తంగా ఈనెల 20వ తేదీన గ్రామ సచివాలయాల వద్ద జరుగు నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని, ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫారసు మేరకు రైతుల పండించిన పంటలకు మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకుల ద్వారా రుణాలు అందచేయాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధులు కల్పిస్తూ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రెండు వందల పని దినాలు కల్పించి, వ్యవసాయ కార్మికులకు రోజువారి 600 వేతనం ఇవ్వాలని కోరుతూ ఈనెల 20వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత మూడు నల్ల చట్టాలను మరల అమలు చేసేందుకు పూనుకుంటుందని ఆయన విమర్శించారు. ఒకవైపు నా వ్యవసాయ రంగం చిన్న భిన్నం అయ్యి, వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఇబ్బందులు పడుతుంటే, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని రైతులను దెబ్బతీసే విధంగా చట్టాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఇటీవల అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు, ప్రభుత్వం వెంటనే సహాయ చర్యలు చేపట్టి, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. స్థానికంగా రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై గ్రామ సచివాలయాల వద్ద జరుగు నిరసన కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలన్నారు.



మాట్లడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి

పాడిపశువుల నిర్వహణకు రుణాలు

గొడవర్రు రైతు సదస్సులో అధికారులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రైతులు పాడి పశువులు నిర్వహణకు అవసరమైన రుణాలను లీడ్‌బ్యాంక్ ద్వారా మంజూరు చేస్తామని లీడ్‌బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి తెలిపారు. దుగ్గిరాల మండలం గొడవర్రులో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, గుంటూరు జిల్లా లీడ్‌బ్యాంక్, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో గురువారం సదస్సు జరిగింది. సదస్సుకు గొడవర్రు ఎంపిటిసి విశ్వనాథపల్లి శివకుమార్ అధ్యక్షత వహించారు. సదస్సులో లీడ్‌బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతు పాడి పశువుల నిర్వహణ కోసం బ్యాంకు రుణాల మంజూరు, ప్రాధాన్యత, సంబంధిత డాక్యుమెంట్‌ల వివరాల గురించి వివరించారు. పెద్దపాలెం యూనియన్ బ్యార్ మేనేజర్ ఎల్లమందయ్య, పెద్దకొండూరు చైతన్య బ్యాంకు మేనేజర్ బి రవి మాట్లాడుతు కౌలు రైతుల రుణాలు, పశువుల దాణారుణాలు సకాలంలో చెల్లించిన వారికి వెంటనే రుణాలు మంజూరు చేస్తామన్నారు. వెటర్నటీ డాక్టర్ కె వెంకట సురేష్, పెద్దపాలెం పి స్వర్ణమంజరి మాట్లాడుతు పశువులకు అవసరమైన చికిత్సలు, ఆరోగ్య సలహాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని, గ్రామ సభల ద్వారా వారిని గుర్తించి కార్డులు ఇవ్వాలని, 2019 కౌలురైతు చట్టంలో మార్పు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో చెప్పిందని దానిని అమలు చేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ కౌలురైతులకు అమలు చేయలేదని, 60 సంవత్సరాలు నిండిన కౌలు రైతులకు రూ.10వేలు పింఛను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, దాసరి విజయలక్ష్మి, నడికుడి మాధవి, ఎన్ నాగరాజు, జి సాంబయ్య, ఎన్ బాబురావు పాల్గొన్నారు.

ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల అవినీతికి

15 మంది మున్సిపల్ ఉద్యోగులు, అధికారులపై చర్యలు

చిలకలూరిపేట మున్సిపల్ చరిత్రలో భారీ కుంభకోణం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట పురపాలక సంఘంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు, ఉద్యోగులపై చర్యలకు ఉన్నతా ధికారులు సమాయుత్తమయ్యారు. కంచే చేనును మేసిన విధంగా ప్రజాధనానికి బాధ్యులుగా ఉన్న మున్సి పాలిటీలో ఇరువురు ఉద్యోగులు చేసిన అవినీతి, ఇతర అధికారుల మెడకు చుట్టుకుంది. మున్సిపల కమిషనర్ ఇప్పటికే కొంత మంది అధికారులను బాధ్యులను చేస్తూ మున్సిపల్ ఉన్నతా ధికారులు చర్యలు తీసుకోగా, మరికొందరూ కూడా ఈ అవినీతి కుంభకోణంలో బాధ్యులు కానున్నారు. వివరాలలోకి వెళ్తే.. మొత్తం ఈ వ్యవహారంలో 15 మంది మున్సిపల్ అధికారులు, ఉద్యోగుల కొలువులకు ఎసరు వచ్చింది. చిలకలూరిపేట మున్సిపాలిటీ చరిత్రలోనే ఇంత మొత్తంలో అధికారులపై చర్యలు తీసుకున్న ఘటనలు గతంలో లేవు.

పురపాలక పరిపాలన శాఖ,కమిష నర్ డైరెక్టర్ నుండి ఈ నెల 14వ తేదీ అందిన లేఖ -11037/82 /2023/ C1-2 అనుసరించి ఈ మొత్తం భాగోతం మరోసారి మున్సిపాలిటీని కుదిపేసింది. చిలకలూరిపేట మున్సిపాలిటీలో గతంలో వెలుగులోకి వచ్చిన నిధుల దుర్వినియోగ ఘటనపై పురపాలక పరిపాలన శాఖ కఠిన చర్యలు చేపట్టింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఐ.గంగాభవానీ రూ.34,34,397లను నకిలీ రశీదుల ద్వారా దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. ఈ మొత్తం నుండి రూ.12,94,024లను తిరిగి చెల్లించినప్పటికీ మిగిలిన రూ.21, 40,373లు ఇంకా వసూలు కావాల్సి ఉంది. ఇదిలా ఉంటే జూనియర్ అసిస్టెంట్ షరాఫ్‌గా పనిచేసిన నక్క జెస్సీ ప్రవీణ్‌కుమార్ రూ.13,67,185లను బ్యాంకులో జమచేయకుండా దుర్వినియోగం చేసినట్లు నిర్ధారించారు. ఈ రెండు ఘటనలపై చిలకలూరిపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో (ఎఫ్ఐ ఆర్ నంబర్ 25/2025&26/2025, తేది: 25.01.2025) కేసులు నమోదు అయ్యాయి. ఈ అవినీతి చోటు చేసుకున్న సందర్భంలో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కాని, పర్యవేక్షణా లోపం కారణంగా పలువురు అధికారులు, ఉద్యోగులను బాధ్యులుగా పురపాలక పరిపాలన శాఖ కమిషనర్, డైరెక్టర్ నిర్ణయించారు. ఈ సంఘటనలకు సంబంధించి ముగ్గురు మునిసిపల్ కమిషనర్లు (ఇందులో కొంతకాలం ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన వారు చుక్కల గోవిందరావు, రవీంద్ర, మేనేజర్ విజయలక్ష్మి, మేనేజర్ నగీన సుల్తానా కూడా ఉన్నారు) ఆరుగురు ఉద్యోగులు జూనియర్ అసిస్టెంట్లు షేక్ కాలేషా, జి వెంకటేశ్వర్లు, గురువయ్య, షేక్ జమీర్, డి.రమేష్‌బాబు, ఇరువురు మేనేజర్లు విజయలక్ష్మి, నగీనా సుల్తానాబేగం, నలుగురు రెవిన్యూ క్లర్కులు జి. శ్రీనివాసమూర్తి, జి. వెంకటేశ్వర్లు, షేక్ అల్లాబక్షు, అబ్దుల్ ఖాదర్ ఉన్నారు. ఇక అకౌంట్ విభాగంలో ఇరువురు కె.మానసకృష్ణ ధనలక్ష్మిపై చర్యలు తీసుకోనున్నారు.

పురపాలక పరిపాలన శాఖ కమిషనర్, డైరెక్టర్ లేఖననుసరించి నిధులు దుర్వినియోగం చేసి అవినీతికి పాల్పడిన ఇరువురు ఉద్యోగులపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని గంగాభవానీ ఉద్యోగం తొలగించాలని, అవినీతికి పాల్పడిన వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేయాలని సూచించారు. ఈ చర్యలతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత రికార్డులను భద్రంగా దాచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

గత ప్రభుత్వంలో జరిగిన స్కామ్‌లో 10మంది ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు : కమిషనర్


కమిషనర్ శ్రీహరిరావు

మున్సిపల్ కార్యాలయంలో అవినీతికి పాల్పడిన ఐదుగురు ఉన్నత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి మున్సిపల్ శాఖకు లేఖ రాశామని కమిషనర్ శ్రీ హరిరావు శుక్రవారం తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగి ఇక్కుర్తి గంగా భవానీ చేసిన రూ. 34.34 లక్షలు స్కామ్‌లో రూ.12.94 లక్షలు ప్రభుత్వానికి జమ చేశారు. మిగిలిన డబ్బు జమ చేయాల్సి ఉంది. స్కామ్‌లో బాధ్యులైన ఆర్ఐలు దావూద్, జమీర్, మానసకృష్ణ (సీనియర్ అసిస్టెంట్) వెంకటేశ్వర్లు, గురవయ్య, రమేష్‌బాబు, శ్రీనివాసమూర్తి, అల్లాబక్షు అబ్దుల్ ఖాదర్, ధనలక్ష్మి వీరు జూనియర్ (అసిస్టెంట్)లు ఈ పదిమంది ఉద్యోగస్తులను శుక్రవారం సస్పెండ్ అయ్యారు. ఈ కింది ఉద్యోలను సస్పెండ్ చేయమని చుక్కల గోవిందరావు (కమిషనర్) రవీంద్ర (కమిషనర్) విజయలక్ష్మి (మేనేజర్) నగీనా సుల్తానా (మేనేజర్) ఈ ఐదుగురుపై మున్సిపల్‌శాఖ, ప్రభుత్వానికి అటాచ్‌మెంట్ చేసింద న్నా రు. మిగిలిన ఉద్యోగులపై తీసుకోవాల్సిన చర్యలపై ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు.


పభుత్వాసుపత్రి నుండి ప్రారంభమైన డెంగీపై అవగాహన ర్యాలీ

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - మాచర్ల

జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం డాక్టర్ కె.పి.చారి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది పట్టణంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించిన సిబ్బంది, ప్రజలు డెంగీ నివారణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ కె.పి.చారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను, నీటి నిల్వలను పరిశుభ్రంగా ఉంచు డెంగీని అరికట్టవచ్చునన్నారు. తాగి పడేసిన కొబ్బరి బోం డాలు, టైర్లు, కుండల్లో నిల్వవున్న నీటిలో డెంగీని వ్యాప్తి చేసే దోమలు పెరుగుతాయన్నారు. అందరూ దోమ తెరలు తప్పని సరిగా వాడాలన్నారు. ప్రతి ఫ్రైడేని డ్రైడేగా పాటింటి, నీటి ట్యాంకులను శుభ్రపరిచి. ఎండపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారులు డి.లక్ష్మయ్య, సిహెచ్. శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నాగే శ్వరరావు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూపర్వైజర్ షేక్ మున్ని

రక్తహీనత లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

రక్తహీనత లేకుండా కిషోర్ బాలికలు చూసుకోవాలని ఐసిడిఎస్ పెదకూరపాడు సెక్టార్ సూపర్వైజర్ షేక్ మున్ని అన్నా రు. శుక్రవారం మండలంలోని పాటిబండ్ల గ్రామంలో కిశోర వికాసంలో భాగంగా కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలకు రుతుక్రమం వల్ల రక్తహీనత వచ్చే అవకాశం ఉందన్నారు. అది రాకుండా పౌష్టికా హారం వేరుశనగలు, బెల్లం, రాగిజావ, కిస్మిస్, ఎండుఖర్జూర, మునగాకుతో కూడిన వంటలు తినడం ద్వారా రక్తహీనత రాదన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు తీసు కోవడంవల్ల మంచి ప్రయోజనం ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మరియమ్మ, సూరమ్మ హెల్పర్లు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణ పుర ప్రజలకు విజ్ఞప్తి పట్టణంలో ఫ్లెక్సీలను ఎవరి ఇష్టానుసారంగ ఎలా పడితే అలా కడుతున్నారనీ, వీటివలన ప్రజల రాకపోకలకు, వాహనదారులకు ఇబ్బంది కలగటంతో పాటు పలు చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలో మునిసిపల్ కమిషనర్ వారి అనుమతి లేకుండా ఎటువంటి బ్యానర్లు, ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయ కూడదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీల చట్టం 196 ననుసరించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. పట్టణంలోని ఫ్లెక్సి ప్రింటర్స్ యాజమన్యం వారు పుర పాలక సంఘం నుండి అనుమతులు పొందని వారికి ఫ్లెక్సీలు ప్రింటింగ్ వేయరాదని తెలిపారు. వేసినచో సదరు షాపుల యజమానులపై చర్యలు తీసుకొనబడునని పేర్కొన్నారు.

భారతదేశం సత్తాను ప్రపంచానికి చాటిన ఆపరేషన్ సిందూర్

తిరంగా ర్యాలీలో పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ, జిడిసిసిబి ఛైర్మన్ మల్లికార్జునరావు


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రజలు

ప్రజాశక్తి - వినుకొండ

పహెల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా సైనిక బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ భారతదేశం సత్తాను ప్రపంచా నికి చాటి చెప్పిందన్నారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. భారత సైనిక శక్తి, సంకల్పానికి నిదర్శనంగా నిలిచిన ఆపరేషన్‌లో సైన్యం ధైర్యసాహసాలు, లక్ష్యాల్ని తుత్తునీయలు చేసిన సాంకేతికతలపై అంతా ఆశ్చర్యపోయి చూస్తున్నారన్నారు. కశ్మీర్‌లో అమాయకులను బలితీసుకున్న ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పిన ప్రధాని మోదీ, ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన త్రివిధ దళాలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ మేరకు సైనికులను అభినందిస్తూ శుక్రవారం వినుకొండలో భారీగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. వినుకొండ మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన శివయ్య స్తూపం, కారంపూడి రోడ్డు, సురేష్ మహల్ రోడ్డు మీదు గా సాగింది. జాతీయ సమైక్యత, సమగ్రతను చాటేలా గీతా లు ఆలపించారు. ఆంజనేయులు మాట్లాడు తూ శత్రు దేశంపై ప్రాణాలు లెక్క చేయకుండా పోరాడిన వీర జవాన్లకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. అమరుడైన వీరజవాన్ మురళీ నాయక్‌కు జోహార్లు అర్పిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆపరేషన్ సిం దూర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించి దేశానికి అం డగా నిలబడ్డారన్నారు. 145 కోట్ల మంది భారత జాతి. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీలు కుల, మతాలకు అతీతంగా తామంతా ఒక్కటేనని సమైక్యతను చాటి చెప్పారన్నారు. ఈ తిరంగా యాత్ర జాతీయ ఐక్యత చిహ్న మని, అన్నివర్గాల ప్రజల్ని ఒక్కతాటి పైకి తెచ్చి, సైన్యానికి గౌరవ వందనం, దేశభక్తిని బలోపేతం చేసే ప్రయత్న మని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతో పాటు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికా ర్జునరావు, విద్యార్థులు, యువత, కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దళితులతో మాట్లాడటం నేరమా? : డాక్టర్ యరమల

ప్రజాశక్తి - మాచర్ల

అంబేద్కర్ కళ్యాణ్ హాస్టల్ విద్యార్థుల ఆహ్వానం మేరకు వారి సమస్యలు ఆలకించటానికి బీహార్‌లోని దర్భంగా జిల్లాకు వెళ్ళిన రాహుల్ గాంధీని బీహార్ ప్రభుత్వం తప్పు పట్టడం, నేరంగా చెప్పడం దుర్మార్గమని, దీనికి కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని మాచర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామ చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీహార్ ప్రభుత్వ తీరు చూస్తుంటే బీహార్ దేశంలో అంతర్భాగమా లేక ప్రత్యేకమైన దేశమా అనే అనుమానం వ్యక్తమౌతోందన్నారు. ఈ ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా దళితుల సమస్యలు వినటం నేరంగా పరిగణించటం దుర్మార్గమని, ఇది రాజ్యాంగ విరుద్ధమని, ఇది నిరంకుశత్వాన్ని ప్రకటిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవే నిర్బంధాలు రాబోయే రోజుల్లో అమలు చేసుకుంటూ పోతే ప్రజలు తిరుగుబాటు చేయడం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు గాదె పుల్లారెడ్డి, కొమ్ము కోటేశ్వరరావు, చిమట వెంకటేశ్వర్లు, దొడ్డా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యరమల

18న ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయపురిసౌత్‌లోని మాతా సరోవర్‌లో ఈనెల 18న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు టిడిపి ఎస్టీ సెల్ మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడు వజ్రం నాయక్ శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం వజ్రం నాయక్ మాట్లాడుతూ ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్,ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో జరగబోయే కార్యక్రమంలో స్థానికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం పల్నాడు జిల్లా వైస్ ప్రెసిడెంట్ బాణావత్ వెంకటేష్ నాయక్, చందు పాల్గొన్నారు.


పిడుగు పడడంతో కాలిన సామగ్రి

బలుసుపాడులో పిడుగు

ప్రజాశక్తి - పెదకూరపాడు


విద్యుత్ ఆగిన సరఫరా

మండలంలోని బలుసుపాడు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఉమ్మినేని అమరయ్య రేకుల ఇంటిపై పిడుగు పడింతది. రేకులు పగిలి పోయాయి. ఫ్రిడ్జ్ డ్యామేజ్ అయింది. మీటర్ వైర్ కాలిపోయాయి. సామాగ్రి కాలిపోయింది. మిక్సీ, రైస్ కుక్కర్ దగ్ధమైంది. మండలంలో తెల్లవారుజామున 12:45 నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు విద్యుత్తును మరల పునరుద్ధ రించారు. విద్యుత్తు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.




తాడేపల్లి, మంగళగిరిలలో డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చిన్న జాగ్రత్తలతో డెంగీ నుంచి రక్షణ పొందవచ్చు

ప్రజాశక్తి - తాడేపల్లి

డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా చిన్న జాగ్రత్తలు తీసుకుంటే పెద్ద రక్షణ అందరం పొందవచ్చు అని తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు డాక్టర్ అనూష చెప్పారు. బుధవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సీతానగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి చుట్టుపక్కల వర్షపు నీరు నిలువ లేకుండా చూడాలని కోరారు. డాబాల మీద వాటర్ ట్యాంకులు మూతలు సరిగా ఉండేటట్టు చూడడంతో పాటు పాడైపోయిన కొబ్బరి బోండాలు, కొబ్బరి చిప్పలు ఉండకుండా చూసుకోవాలని కోరారు. కుటుంబాన్ని, సమాజాన్ని డెంగ్యూ వ్యాధి నుండి రక్షించేందుకు ప్రామాణికమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ గురు కుమార్, ఎస్ యుఓ సుధీర్, హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్ మరియు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి :స్థానిక గణపతి నగర్లోని ఇందిరా నగర్ యూపీహెచ్సీలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హెల్త్ సెంటర్, మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష ఈ ఏడాది థీమ్ మైన పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అనే మూడు అంశాలతో ఏఎన్ఎంలు, ఆశాలు, హెల్త్ సెంటర్ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ అనూష మాట్లాడారు. ఏడీస్ అనే పగలు కుట్టే దోమ కాటు వల్ల డెంగ్యూ సోకుతుందన్నారు. డెంగ్యూ సోకిన వారికి అధిక జ్వరం, వాంతులు, దద్దుర్లు, తలనొప్పి, కీళ్లు కండరాల నొప్పి, కళ్ళ వెనక నొప్పి, ప్లేట్ లేట్లు పడిపోయి చిగుళ్ళు, ముక్కు నుండి రక్తం కారుట వంటి లక్షణాలు ఉంటాయన్నారు. డెంగ్యూ లక్షణాలు కనబడితే సమీపంలోని హెల్త్ సెంటర్లో ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎ.శ్రీమన్నారాయణ, ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ దీపిక, డాక్టర్ ఆదిత్య, మలేరియా సూపర్వైజర్ సైదులు, హెల్త్ అసిస్టెంట్స్ వాసు, నరసింహారావు, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాల్ మిల్లర్లతో లీగల్ మెట్రాలజీ అధికారుల సమావేశం

ప్రజాశక్తి - తెనాలి

ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్లో శుక్రవారం దాల్ మిల్లర్స్ అసోసియేషన్‌తో లీగల్ మెట్రాలజీ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎం.ఎన్.ఎస్ మాధురి మాట్లాడుతూ ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం వేడుకలు మే 8 నుంచి 20 వరకు జరుపుకుంటామని, శాఖా పరమైన విధివిధానాలు మార్పులను వినియోగదారులకు వివరించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. దానిలో భాగంగానే గుంటూరు, తెనాలి, వినుకొండ డాల్ మిల్లర్స్ తో సమావేశమైనట్లు చెప్పారు. 25 కేజీలలోపు ప్యాకింగ్ కు సంబంధించి నిబంధనలు వివరించారు. తయారీ కేంద్రం, చిరునామా, బరువు, మెటీరియల్ పేరు, ప్యాకింగ్ తేది, ధర విధిగా ఉండాలని చెప్పారు. 25 కేజీల పైబడి బరువు కలిగిన ప్యాకింగ్‌లపై ఉండాల్సిన నిబంధనలను వెల్లడించారు. సమావేశంలో గుంటూరు పల్నాడు జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్లు జి.కొండారెడ్డి, ఎన్.అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్లు జి.ఎస్.సునీల్ రాజు, బి.శేష సాయి, జి.సాయి శ్రీకర్, షేక్ జాన్ సైదా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ మాధురి

వేసవి శిక్షణ శిబిరంలో 'కిశోరి వికాసం'

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వేసవి సెలవులు వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించిన సంగతి తెలిసిందే. తెనాలి సిడిపివో డాక్టర్ ఎం సునీత పర్యవేక్షణలో శుక్రవారం సెక్టార్ వన్ పరిధిలోని 'కిశోరి వికాసం' నిర్వహించారు. స్థానిక నాలుగో వార్డు అంగన్వాడి కేంద్రంలో కిశోరి బాలికలకు కౌమార దశలో ఇనుము, రక్తహీనత లోపాలను సెక్టార్-1 సూపర్వైజర్ కె సౌజన్య శ్రీ అవగాహన కల్పించారు. విద్య, నైపుణ్యం, ఎదుగుదల పోటీ తత్వం, వ్యక్తిగత శుభ్రత వంటి 12 అంశాలపై బాలికలకు అవగాహన కల్పించనున్నామని సౌజన్యశ్రీ తెలిపారు. కార్యక్రమంలో మహిళ పోలీసు సాయిప్రసన్న, అంగన్వాడి కార్యకర్తలు సూర్యకుమారి, రేణుక, బాలికలు తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు కౌమార దశపై అవగాహన కల్పిస్తున్న సౌజన్యశ్రీ

ఏపీ రాష్ట్ర జై కాపుసేన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిరుమలశెట్టి

ప్రజాశక్తి - మంగళగిరి

ఏపీ రాష్ట్ర జై కాపుసేన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంగళగిరికి చెందిన తిరుమలశెట్టి కొండలరావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో జై కాపుసేన వ్యవస్థాపక అధ్యక్షులు బసవ చినబాబు చేతుల మీదుగా కొండలరావు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జై కాపుసేన వ్యవస్థాపక అధ్యక్షులు బసవ చినబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని పేద కాపులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కాపులకు విద్య, వైద్యం ఉచితంగా అందించి న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో కాపు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం జరిగేలా కఅషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జై కాపుసేన రాష్ట్ర అధ్యక్షులు బెల్లంకొండ వెంకన్న బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సమ్మెట వెంకన్న బాబు, చిట్టూరి రవీందర్, మేడేపల్లి కనక రామకఅష్ణ , ప్రధాన కార్యదర్శి మొహమాటం అనిల్ బాబు, లీగల్ సెల్ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎడ్లపల్లి దానారావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు అన్నదాసు శ్రీనివాసరావు, జిల్లా యువజన అధ్యక్షులు సోమరాజు సాంబశివరావు, గుంటూరు జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వామన పల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తిరుమలశెట్టి కొండలరావును సన్మానిస్తున్న నాయకులు



వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఛైర్‌పర్సన్, కమిషనర్

పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు బహూకరణ

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను ఛైర్ పర్సన్ తాడి బోయిన రాధిక అందించారు. మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న అధ్యక్షతన శుక్రవారం పురపాలక సంఘం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 400 మంది రెగ్యులర్, ఆప్కాస్ పారిశుధ్య కార్మికులకు రేడియం జాకెట్, సబ్బులు-12, కొబ్బరి నూనె, వంటనూనె, హెడ్ క్యాప్, హ్యాండ్ గ్లౌజులు ఛైర్ పర్సన్ పంపిణీ చేశారు. కార్యక్రమం లో15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మి పతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. హెలెన్ నిర్మల పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి వి.నాగేశ్వరరావును యాజమాన్యం ఏకపక్షంగా అన్యాయంగా సస్పెన్షన్ చేయటాన్ని రీజనల్ కార్యదర్శి విజయ్ కుమార్ ఖండించారు. శుక్రవారం మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రెండవ రోజు దీక్షలను ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్, చిన్ని సత్యనారాయణ లు మాట్లాడుతూ మంగళగిరి డిపో కార్యదర్శి బి నాగేశ్వరరావును యాజమాన్యం ఏకపక్షంగా సస్పెన్షన్ చేయడం అన్యాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షలో కూర్చున్న వారికి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు కాసిం, నాగయ్య, ధనుంజయ రెడ్డి, ఆర్.డి.సహాయం, అసోసియేషన్ మాజీ ఉద్యోగి పి.ఎస్.ఎస్.కె. ప్రసాద్, సంఘీభావం తెలియజేశారు.



న్యాయమూర్తి దంపతులను సత్కరిస్తున్న ఆలయ పండితులు

మల్లేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి వారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ మధుసూదనరావు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. జస్టిస్ బి ఆర్ మధుసూదన రావు దంపతులకు ఆలయ అధికారులు సాదర స్వాగతము పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేయించారు. న్యాయమూర్తి దంపతులు రాహు కేతు పూజలలో పాల్గొన్నారు. ఆలయ అర్చకస్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనాలు చేయగా శ్రీ స్వామి వారి శేషవస్త్రముతో సత్కరించి లడ్డూ ప్రసాదాలు, శ్రీ స్వామి వారి చిత్రపటం అందజేసినట్లు ఆలయ ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు.

నేడు తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కఅష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నేడు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత్ త్రివిధ దళాలకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో అన్ని గవర్నమెంట్, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు రాజకీయ నేతలు, నియోజకవర్గ పౌరులు జాతీయ జెండాతో పాల్గొనాలన్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు


ప్రతాప్‌కుమార్‌కు పిహెడి పట్టా అందచేస్తున్న వీసీ

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రావుల ప్రతాప్ కుమార్‌కు సీఎస్ఈ విభాగంలో తమ యూని వర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'డిటెక్షన్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ వార్మ్‌హోల్ అటాక్స్ ఇన్ ఏ వెహికులర్ అడహక్ నెట్‌వర్క్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని అడ్వాన్స్డ్ సీఎస్ఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన మాజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పలపాటి శ్రీలక్ష్మి గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్‌ను వర్సిటీ వీసీ, డీన్‌లు, అధ్యాపకులు అభినందించారు.

జయపాల్ బాబుకు డాక్టరేట్

ప్రజాశక్తి తెనాలి



పట్టణానికి చెందిన మధిర జైపాల్ బాబుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పిహెచ్డి ప్రధానం చేసింది. జైపాల్ మంగళగిరిలోని విటిజెఎం అండ్ ఐవిటిఆర్ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆంధ్ర లయోలా కళాశాల చరిత్ర రీడర్ డాక్టర్ మొవ్వా శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో ఆయన షెడ్యూల్ తెగల ప్రాథమిక విద్యా ప్రగతికి ప్రభుత్వ కృషి, చారిత్రక పరిశీలన, తూర్పుగోదావరి జిల్లా ప్రత్యేక అనుబంధం అనే అంశంపై పరిశోధన చేశారు. ఆ పరిశోధనను పరిశీలించిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ రెగ్యులేషన్స్ ఆధారంగా కెరీర్ అడ్వాన్స్మెంట్ స్కీం (సిఎఎస్) ఆయనకు డాక్టరేట్ ప్రధానం చేసింది. డాక్టరేట్ సాధించిన జయపాల్ ను కళాశాల కరెస్పాండెంట్ వివి తాతారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై నాగేశ్వరరరావు, మాజీ ప్రిన్సిపాల్ ఎ వెంకటేశ్వర యోగి, అధ్యాపకులు అభినందించారు.

మొబైల్ మెడికల్ వాహనాలు ప్రారంభం

గుంటూరు లోక్‌సభ పరిధిలోని గ్రామాల్లో వైద్యసేవలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


ప్రారంభ కార్యక్రమంలో మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

గెయిల్ ఇండియా సంస్థ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన రెండు మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాలను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం గుంటూరులో స్థానిక ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని ఒక్కో వాహనం నిర్వహణకు ఏడాదికి రూ. 35 లక్షల చొప్పున 2 వాహనాలకు కలిపి రూ. 70 లక్షలను గెయిల్ సంస్థ ఖర్చు చేస్తుందన్నారు. ఈ వ్యానులో ఒక ఎంబిబిఎస్ డాక్టర్, నర్స్, హెల్పర్, డ్రైవర్ వైద్యం నిమిత్తం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని మంత్రి తెలిపారు. అందులో ప్రాథమిక పరీక్షలు చేసి, 100 రకాల ఉచిత మందులు కూడా అందిస్తారని చెప్పారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ వాహనాలు పేద, బడుగు వర్గాలు నివసించే ప్రాంతాల్లో తిరుగుతూ, ప్రజలకు నిత్యం వైద్య సదుపాయాలకు అందుబాటులో పనిచేస్తాయన్నారు. వన్ ఇయర్ పైలట్ ప్రోగ్రాం కింద ఈ వాహనాలు ముందుగా పనిచేస్తాయన్నారు. అందరూ పూర్తిగా వినియోగించగలిగితే మరో సంవత్సరం పొడిగిస్తామన్నారు. త్వరలో ఈ రెండు వాహనాల కాకుండా అదనంగా మరిన్ని వాహనాలను తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు పూర్తిగా ఉపయోగించుకోవాలన్నారు. గెయిల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూప్ గుప్తా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, జీఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు, టిడిపి నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, జిల్లా జనసేన పార్టీ నాయకులు గాదె వెంకటేశ్వరరావు, జిజిహెచ్ సూపరిండెంట్ రమణ, స్థానిక కార్పొరేటర్ ఎల్లావుల అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు అందరూ కృషి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు



ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఓ, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది

డెంగీ వ్యాధి నివారణకు ప్రజలు అందరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రం నుండి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఈ ర్యాలీ పట్టణ ఆరోగ్యకేంద్రం నుండి యాదవ హైస్కూల్ వరకు, తిరిగి ఆరోగ్య కేంద్రం వరకూ నిర్వహించారు. డెంగ్యూ దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ మీరావలి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్.ఏ.శ్రావణ్ బాబు, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, వైద్యాధికారులు డాక్టర్ ఫిర్దోస్ అహ్మద్, డాక్టర్ అజిమాఖాతున్, ఏఎంఎఒ రాజూనాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఘంటసాల.శ్రీనివాసరావు, నరేంద్రబాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో ఇ-5 రోడ్డుకు 240 అడుగుల స్థలానికి మార్కింగ్

విస్తరణలో తొలగించే ఇళ్లు, స్థలాలు పరిశీలించిన సిఆర్‌డిఎ అధికారులు

న్యాయం చేయాలంటూ అదనపు కమిషనర్‌కు స్థానికుల వినతి


ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో నిర్మించనున్న అతి పెద్ద ఇ -5 రోడ్డు వల్ల ప్రభావిత మయ్యే నివాస గృహాలు, ఖాళీ స్థలాలను శుక్రవారం సి ఆర్ డి ఎ అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణంలో తుళ్లూరులో నివాస గృహాలు, ఖాళీ స్థలాలు వందకు పైగా ఉన్నాయి. రోడ్డు నిర్మాణం కోసం అధికారులు ప్రాథమిక సర్వే చేశారు. సుమారు 240 అడుగుల రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేశారు. ఈ నేపధ్యంలో అదనపు కమిషనర్ సాయి సూర్య ప్రవీణ్ చంద్, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి తుళ్లూరులోని ఉర్దూ స్కూల్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లను పరిశీలించారు. రోడ్డుకు పక్కన ఇళ్లల్లో ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్నామని, రోడ్డు నిర్మాణంలో వాటిని తొలగించిన పక్షంలో తగిన న్యాయం చేయాలని బాధితులు కమి షనర్ కు విజ్ఞప్తి చేశారు. కమర్షియల్ అంశాన్ని దష్టిలో పెట్టుకోవాలని కోరారు.


ఇళ్ల యజమానులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

సిఆర్‌డిఎ గ్రీవెన్స్‌కు 36 ఫిర్యాదులు

గ్రీవెన్స్‌డేకు వచ్చిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ లో సమస్యలు పరిష్కరించటంలో అలసత్వం వద్దని సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు


గీవెన్స్‌లో అదనపు కమిషనర్ సాయి ప్రవీణ్ చంద్‌కు సమస్యలు తెలుపుతున్న రైతులు


జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రీవెన్స్ ఎన్- 13 రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, వారసులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, గ్రామకంఠం భూముల సమస్యలు తదితర అంశాల గురించి పలువురు రైతులు అదనపు కమిషనర్ కు విన్నవించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అర్జీదారుల సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అదనపు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కౌలు నగదు చెల్లింపుకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అనంతరం సంబంధిత రైతు బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని, అదే విధంగా ఎన్ -13 రోడ్డు అలైన్‌మెంట్, గ్రామకంఠం భూములపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 34 భూసంబంధిత ఫిర్యాదులు అందాయని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె స్వర్ణమేరి, అధికారులు ఎజి చిన్ని కృష్ణ, బి సాయి, శ్రీనివాస్‌నాయక్, జి రవీందర్, ఎం శేషిరెడ్డి, కె ఎస్ భాగ్యరేఖ, జిఆర్ఎం నోడల్ అధికారి పి జయశ్రీ, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి : నగర కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు


కంకరగుంట ఆర్‌యుబి వద్ద నిలిచిన నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

రాబోయే మూడ్రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణశాఖ సూచనల మేరకు నగరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, గత రాత్రి కురిసిన వర్షానికి నగరంలో విరిగిన చెట్లు, హోర్డింగ్‌లను నీరు నిలిచిన ప్రాంతాల్లో బెయిల్ అవుట్‌ను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ 3 వంతెనలు, అరండల్‌పేట, అమరావతి రోడ్డు, విద్యానగర్ మెయిన్‌రోడ్డు, మారుతినగర్, కంకరగుంట ఆర్‌యుబి తదితర ప్రాంతాల్లో పర్యటించి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం వలన ప్రజలకు ఏ సమస్య తలెత్తకుండా జీఎంసి అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు, చెట్లు విరిగి ట్రాఫిక్‌కి అడ్డుగా ఉన్నా, వర్షంనీరు నిలిచినా తక్షణం జీఎంసి కాల్‌సెంటర్ 08632345103, 104, 105 నంబర్లకు ఫోన్ చేస్తే సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. నోడల్ అధికారులు, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయిలో విధుల్లో ఉండాలని, విభాగాధిపతులు ఎక్కడా సమస్య రాకుండా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. 3 వంతెనల వద్ద నిలిచిన సిల్ట్‌ని, జెట్టింగ్ మెషిన్ల ద్వారా శుభ్రం చేయాలని, కంకరగుంట ఆర్‌యుబి వద్ద అదనపు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని బెయిల్‌అవుట్ చేయాలని డిఈఈని ఆదేశించారు. విరిగిన చెట్లను తొలగించడానికి ఉద్యాన శాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచి, కాల్ సెంటర్ నుండి వచ్చిన ఫిర్యాదులకు తక్షణం హాజరు


గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో కూలిన చెట్టు

కావాలన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం వలన తాగునీటి సరఫరాకి సమస్య లేకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవడం, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఈఈలను ఆదేశించారు. మెయిన్ డ్రైన్లలోకి చిన్న డ్రైన్లు కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్ ల వద్ద వ్యర్థాలను ప్రజారోగ్య కార్మికుల ద్వారా ఎప్పటికప్పుడు తొలగించేలా పర్యవేక్షణ చేయాలని సిఎంఓహెచ్‌ని ఆదేశించారు. నగరంలో పలు ప్రాంతాల్లో హోర్డింగ్స్ విరిగి, బ్యానర్లు గాలికి ఎగురుతున్నాయని, ఆయా హోర్డింగ్ లను తక్షణం తొలగించాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. అలాగే నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవన యజమానులు వర్షాలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, శిధిలావస్థలోని పురాతన భవన యజమానులకు నోటీసులు ఇవ్వాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. పర్యటనలో సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ మధుసూధన్, ఏఈలు, టిపిఎస్ లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ

ప్రజాశక్తి-గుంటూరు

నిర్మాణంలో ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఎం. వెంకటరామకృష్ణ తేజ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం భవనాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీక్రిస్టినాతో కలిసి పరిశీలించారు. జరుగుతున్న పనుల పట్ల ఆయన సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన డిఎల్‌డిఓ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఓ.ఎస్.డి వెంకటకృష్ణ,


భవన నిర్మాణం పరిశీస్తున్న కృష్ణతేజ, జడ్‌పి చైర్మన్ హెనీక్రిస్టీనా

పంచాయితీరాజ్ ఎస్ఈ జి.బ్రహ్మాయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, డి.ఇ శివరామకష్ణ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్, డిపిఓ సాయికుమార్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.